# అవినీతి పాలనకు చరమగీతం పాడాలి


ప్రచారంలో మాట్లాడుతున్న మురళీనాయక్


ప్రచారానికి హాజరైన జనం

● కాంగ్రెస్ అభ్యర్థి భూక్య మురళీనాయక్

**మహబూబాబాద్ రూరల్:** అవినీతి, అరాచకాలకు నిలయంగా మారిన కేసీఆర్ కుటుంబ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని ఎమ్మెల్యే అభ్యర్థి మురళీనాయక్, ఏఐసీసీ ఆదివాసీ విభాగం జాతీయ ఉపాధ్యక్షుడు తేజావత్ బెల్లయ్యనాయక్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూక్య మురళీనాయక్ గెలుపు కోరుతూ కాంగ్రెస్, సీపీఐ, టీజేఎస్, వైఎస్సార్ టీపీ, కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం భారీ ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మోసానికి మారుపేరు కేసీఆర్ అని, బంగారు తెలంగాణగా మారుస్తామని ప్రగాల్భాలు పలికి అప్పుల తెలంగాణగా మార్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తును ఓటేసి గెలిపించాలను.దొరల పాలనను కొనసాగిస్తూ సీఎం కేసీఆర్ మనం కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం వస్తుందన్నారు. మానుకోటలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చరిత్ర అందరికి తెలిసిందేనన్నారు. హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న నిజాం నవాబు కాలం నాటి ఐదు లక్షల ఎకరాల ప్రభుత్వ భూముల్లో 50వేల ఎకరాల భూములను సీఎం కేసీఆర్ అమ్ముకున్నాడని విమర్శించారు. మురళీనాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇచ్చి చేతి గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ పాలకుల అవినీతి అక్రమాలపై విచారణ జరిపిస్తామని, శంకర్‌నాయక్‌ను మానుకోట నుంచి వెళ్ల గొట్టాలని పిలుపునిచ్చారు. దోపిడీ దొంగల ముఠా బీఆర్ఎస్ అంటూ కారును తుక్కు తుక్కుగా ఓడించాలన్నారు. గిరిజనులను రెచ్చగొట్టడం కోసం బీఆర్ఎస్ ప్రచారం చేస్తుందన్నారు గిరిజనుల భూములను లాక్కొని వారిని జైలుకు పంపిన ఘనత బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థికే దక్కుతుందన్నారు. ఆయన అరాచకాలకు అడ్డులేకుండా పోయిందని, ఒక నాటి ప్రభుత్వ భూములన్నీ ఆయనతోపాటు బినామీ పేర్లపైకి మారిపోయాయన్నారు. డబ్బులతో ప్రజలను కొనాలని చూస్తున్నారని, ప్రజలందరూ మరోసారి పునరాలోచన చేసి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. ప్రచారంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, టీఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, వైఎస్సార్ టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాములునాయక్, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు బి.అజయ్‌సారథిరెడ్డి, వెన్నం లక్ష్మారెడ్డి, అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఉమా, నాయకులు రాజు, సురేందర్ పాల్గొన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న మురళీనాయక్

### కాంగ్రెస్ నాయకుల బైక్ ర్యాలీ

**మహబూబాబాద్ అర్బన్:** మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి 2, 3 వార్డు కాంగ్రెస్ నాయకులు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పందేండ్ల అరాచకాలను అంతం చేద్దామని, ప్రజాసంక్షేమ పాలన తెచ్చే కాంగ్రెస్ అభ్యర్థి మురళీ నాయక్ గెలిపిద్దామన్నారు. కార్యక్రమంలో నాయకులు గండు కార్తిక్, గాడిపల్లి రవి, అంబాల అశోక్, ప్రవీణ్ కుమార్, మహేష్, నవీన్ పాల్గొన్నారు.

# అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

● బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్
● ప్రచారంలో పాల్గొన్న మంత్రి సత్యవతి రాథోడ్

**మహబూబాబాద్:** మానుకోటలో జరిగిన అభివృద్ధి చూసి తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్ నాయక్ ఓటర్లను కోరారు. జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో మంగళవారం శంకర్‌నాయక్ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానుకోట మున్సిపాలిటీ పరిధిలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగి మానుకోట రూపు రేఖలు మారాయన్నారు. మానుకోట గడ్డపై గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలో వస్తుందని సీఎం కేసీఆర్ అవుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి నాయకులు గంగాధర్, గోగుల రాజు, తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.


మహబూబాబాద్: మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్, అభివాదం చేస్తున్న శంకర్‌నాయక్


మానుకోట మార్కెట్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న శంకర్‌నాయక్


కేసముద్రం: ఇనుగుర్తిలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

### బీఆర్ఎస్‌ను గెలిపించాలి

**కేసముద్రం:** తెలంగాణ రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మహబూబాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పరపల్లి, అర్పనపల్లి శివారు కిష్టాపురంతండాలో, ఇనుగుర్తి మండలంలోని లాలుతండాజీపీ శివారు రాముతండా, చీన్యాతండాజీపీ, అయ్యగారిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకే సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడాలేని విధంగా పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాడన్నారు. ఎన్నికలు రాగానే కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓట్లను దండుకోవడానికి చెప్పే మాయ మాటలను ప్రజలను నమ్మవద్దన్నారు. అభివృద్ధి జరగాలంటే ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్‌కు ఓట్లేసి, కేసీఆర్‌ను సీఎం చేయ్యాలన్నారు. మానుకోట గడ్డపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత వద్దిరాజు కిషన్, ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాధ్‌రెడ్డి, కేసముద్రం సొసైటీ చైర్మన్ దికొండ వెంకన్న, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, నీలం దుర్గేష్, సావిత్రమ్మ, జాటోత్ హరీశ్‌నాయక్, మండల అధ్యక్షుడు ఎండి.నజీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్‌రెడ్డి, నెహ్రూరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

## హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

**బయ్యారం:** బాలికలు రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ అరుణ అన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బయ్యారంలోని బాలికోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన బేటీ బచా వో.. బేటీ పడావో కార్యక్రమంను ఉద్దేశించి మాట్లాడారు. బాలికలు తమ తల్లిదండ్రులకు మంచిపేరు వచ్చేలా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు.



# కాంగ్రెస్ పార్టీ ఆశలు గల్లంతే

**బయ్యారం/గార్ల:** అధికారంలోకి వస్తామనే ఆశతో ఉన్న కాంగ్రెస్ నాయకుల ఆశలు డిసెంబర్ 3న వెల్లడయ్యే ఫలితాలతో గల్లంతు కానున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ బిందు అన్నారు. ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ విజయంను కాంక్షిస్తూ మంగళవారం మండలంలోని వెంకటాపురం పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మౌనిక, మండల ఉపాధ్యక్షురాలు పొడుగు సుగుణ తదితరులు పాల్గొన్నారు. గార్ల మండలంలోని పెద్దకిష్టాపురం, సీతంపేట, అంజనాపురం గ్రామాలకు చెందిన సుమారు 200 కుటుంబాలు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీపీ శివాజీచౌహాన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హరిప్రియ గెలుపు కోరుతూ 500 బైక్‌లతో గార్లలో భారీ ర్యాలీ నిర్వహించారు.


బయ్యారం: ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బిందు

# నన్ను ఓడించాలని కంకణం కట్టుకున్నాడు

● బీఆర్ఎస్ అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్

**మరిపెడ రూరల్:** తనను ఓడించాలని మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి కంకణం కట్టుకున్నాడని డోర్నకల్ బీఆర్ఎస్ అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్ ఆరోపించారు. ప్రచారంలో భాగంగా మరిపెడ మండలంలోని ఎడ్జెర్ల, గుర్రప్పతండా, లచ్చతండా, తండధర్మారం, బాల్నిధర్మారం, ఉల్లెపల్లి, భూక్య తండ, లూనావత్‌తండా గ్రామాల్లో ప్రజాఆశీర్వాద కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయా సమావేశాల్లో రెడ్యానాయక్ మాట్లాడుతూ.. స్వర్థం కోసం లంబాడీల ఓట్ల కోసమే మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి తనను రాజకీయాల్లోకి తీసుకొచ్చాడని ఆరోపించాడు. నాన్ లోకల్ అభ్యర్థి రాంచంద్రునాయక్‌ను గెలిపిస్తే మీ పరిస్థితి అధోగతేనన్నారు. రైతులకు రైతుబంధు కింద ఎకరాకు రూ.16వేలు అందించనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు, మాజీ ఎంపీపీ వెంకన్న, ఆయా గ్రామాల సర్పంచులు లక్ష్మీ లక్‌పతి, బానోతు బిక్కునాయక్, దార ఆనంద్, ప్రభాకర్, సేవ్యనాయక్, లూనావత్ వీరమల్లు , ఎంపీటీసీ జ్యోతి రామ్మూర్తి పాల్గొన్నారు.

**దంతాలపల్లి:** రెడ్యానాయక్ గెలిస్తేనే నియోజకవర్గానికి మహర్దశ పడుతుందని ఎంపీపీ ఓలాద్రి ఉమా మల్లారెడ్డి అన్నారు. రెడ్యానాయక్ గెలుపు కోసం మండలంలోని రామానుజపూరం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ నాగయ్య, మల్లారెడ్డి, ఉపసర్పంచ్ యాదగిరి పాల్గొన్నారు.

**కురవి:** కురవిలో రెడ్యానాయక్‌ను గెలిపించాలని నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. శ్రీనివాస్, నర్సింహరావు, రమేష్ పాల్గొన్నారు.

**చిన్నగూడూరు:** రెడ్యానాయక్ గెలుపును కాంక్షిస్తూ మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మూల మురళీధర్ రెడ్డి, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ మంగపతిరావు, రాంసింగ్, ధారాసింగ్, ఉప్పలయ్య, సర్పంచ్ మల్లయ్య, కోఆప్షన్ సభ్యులు మోసిన్ బేగ్, మండల కోశాధికారి యాకూబ్ రెడ్డి పాల్గొన్నారు.


మరిపెడ రూరల్: గుర్రప్పతండాలో మాట్లాడుతున్న రెడ్యానాయక్


డోర్నకల్: టేకులతండాలో తండావాసులతో కలిసి నృత్యం చేస్తున్న నాయకులు

**డోర్నకల్:** మండలంలోని ఉయ్యాలవాడ శివారు టేకులతండాలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నున్నా రమణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి రెడ్యానాయక్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



# అధికారంలోకి వస్తేనే 'గ్యారంటీ'లు అమలు


బయ్యారం: మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు, పక్కన కనకయ్య

**బయ్యారం:** కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే ప్రజల బతుకులు మారుతాయని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య అన్నారు. మండలంలోని కంబాలపల్లి పంచాయతీలో మంగళవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలు అమలవుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీపీ నియోజకవర్గ అధ్యక్షురాలు బానోత్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

### కనకయ్య గెలుపు కోరుతూ బైక్ ర్యాలీ

**గార్ల:** కోరం కనకయ్య గెలుపు కోరుతూ మండలంలోని ముల్కనూరు, పెద్దకిష్టాపురం, చిన్నకిష్టాపురం పంచాయతీల్లో మంగళవారం కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సర్పంచ్ రాందాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎద్దు లక్ష్మయ్య, వెంకటేశ్వరరావు, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

# పోటాపోటీగా సాగిన ఎన్నికల ప్రచార హోరు

**గూడూరు:** మండల కేంద్రంలో మండల నాయకులు నూకల సురేందర్‌యాదవ్, ఏపూరులో ఎన్డీపీఎస్ నాయకుడు బానోతు రామన్ననాయక్, కాంగ్రెస్ తరఫున బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. మానుకోట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకోసం ద్విచక్రవాహనాలపై నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ వేం వాసుదేవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి ముందుండి నడిపించారు.

**నెల్లికుదురు:** మండలంలోని వివిధ గ్రామాలల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపి పార్టీల నాయకులు మా గుర్తుకు ఓటు వేయాలని ఆయా పార్టీల గుర్తులున్న కర పత్రాలతో ర్యాలీలు నిర్వహిస్తూ ప్రచారం నిర్వహించారు.

**కురవి:** మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల నాయకుడు ఎర్ర నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సీపీఐ నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం చేశారు. తులిస్యా తండా, లింగ్యా తండా, రేకుల తండాల్లో ప్రచారం చేశారు.

# సామాజిక దార్శనికుడు పూలే

**సాక్షి నెట్‌వర్క్:** మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పూలే విస్తృత కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమ నాయకుడిగా పని చేశారని, అగ్రవర్ణ బ్రాహ్మణులకు ఎవరు లోబడి ఉండరాదని నిక్కచ్చిగా తెలియజేసిన మహనీయుడు, సామాజిక దార్శనికుడు జ్యోతిబాపూలే అన్నారు. డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వీరన్న, హెచ్ఎం వెంకన్న, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.


మహబూబాబాద్ రూరల్: పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

## బీఎస్పీని గెలిపించాలి

**మహబూబాబాద్ అర్బన్:** మానుకోట నియోజకవర్గ నిరుద్యోగుల కోసం బీఎస్పీ ఏనుగు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని బీఎస్పీ అభ్యర్థి గుగులోత్ శేఖర్ నాయక్ కోరారు. జిల్లా కేంద్రంలోని పలువార్డులో మంగళవారం ప్రచారం నిర్వహించి, జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్, జిల్లా ఇన్‌చార్జి దార ప్రసాద్ రావు, జిల్లా అధ్యక్షుడు ఇసంపెల్లి ఉపేందర్, జిల్లా కోశాధికారి జింక లక్ష్మణ్, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.





## సంక్షిప్త సమాచారం

### కొనుగోలు కేంద్రం ప్రారంభం

**దంతాలపల్లి:** మండలం పెద్దముప్పారం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రంను వ్యవసాయ అధికారులు ప్రారంభించారు. అధికారులు సందీప్, దీక్షిత్, సీఈఓ వెంకన్న, కార్యదర్శి మధు పాల్గొన్నారు.

### అమ్మ నాన్న.. ఓటెయ్యండి



**కేసముద్రం:** అమ్మ..నాన్న ఓటెయ్యండి అంటూ మండలంలోని నర్సింహులగుడెంజీపీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం ప్లకార్డులతో ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు.

### 144 సెక్షన్ అమలు

**గార్ల:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గార్లలో సాయంత్రం 5 గంటల నుంచి 144 సెక్షన్ అమలులోకి వచ్చిందని ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు. ప్రధాన కూడళ్లలో గుంపులు, గుంపులుగా సంచరించరాదని, ప్రచారాలు చేయకూడదన్నారు. నేటి నుంచి 30వ తేదీ వరకు మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

### కరాటేలో విద్యార్థుల ప్రతిభ

**బయ్యారం:** ఈనెల 26న ఖమ్మంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండలంలోని నామాలపాడు ఏకలవ్య పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈపోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు 5 బంగారు, 9 వెండి, 5 కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రవిబాబు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ గీత, పీఈటీ విజయనిర్మల తదితరులు అభినందించారు.

### మద్యం పట్టివేత

**డోర్నకల్:** మండలంలోని తొడేళ్లగూడెం గ్రామంలోని ఓ దుకాణంపై మంగళవారం డోర్నకల్ పోలీసులు దాడులు నిర్వహించి మద్యం సీసాలను స్వాధీనపర్చుకున్నారు. ఎస్సై ఝూన్సీ తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ సిరాజ్‌కు చెందిన దుకాణంలో దాడులు నిర్వహించి రూ.4,468 విలువైన మద్యం సీసాలను స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపాడు.

### రాంచంద్రునాయక్ గెలుపునకు కృషి

**డోర్నకల్:** అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సీపీఎం మద్దనిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి రాంచంద్రునాయక్ గెలుపు కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శెట్టి వెంకన్న, నాయకులు బొబ్బ వెంకటరెడ్డి, ఉప్పనపల్లి శ్రీనివాసరావు, బొమ్మన అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



**కురవి:** రాష్ట్రస్థాయి సీనియర్స్ బాలికల కబడ్డీ పోటీలకు మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన బాలిక బి.నందిని ఎంపికైనట్లు పాఠశాల పీజీహెచ్ఎం డీసీఎస్ శర్మ తెలిపారు. మంగళవారం పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాలికలను అభినందించారు. డిసెంబర్ 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగే పోటీల్లో బాలిక పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో పీడీ అనిల్‌కుమార్, హెచ్‌డబ్ల్యూఓ బి.పద్మ, ఉపాధ్యాయులు వెంకన్న, భద్రు, గోవర్ధన్ పాల్గొన్నారు.

### కేసీఆర్‌ను గద్దె దించుదాం

**నెహ్రూసెంటర్:** ప్రగతిభవన్ గుప్పిట్లో బంధీగా ఉన్న పురపాలిక విముక్తి కోసం, హక్కులను హరించిన కేసీఆర్‌ను ఈ ఎన్నికల్లో గద్దెదించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి మంగళవారం పిలుపునిచ్చారు.

### కనుల పండువగా 'జ్వాలాతోరణం'

**గూడూరు:** మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం రాత్రి కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని జ్వాలాతోరణం వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం కార్తీకపౌర్ణమి సందర్భంగా శివపార్వతుల కల్యాణంతో పాటు ఆలయ ధ్వజస్తంభం ఎదుట జ్వాలాతోరణ వేడుకలు నిర్వహిస్తున్నారు. కాగా ఆలయ చైర్మన్ ఏపూరు రవీందర్ రెడ్డి, కమిటీ ప్రతినిధులు గాదె సాగర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రాత్రి శివపార్వతుల కల్యాణం అనంతరం ఉత్సవ విగ్రహాలను భక్తులు పల్లకీలో తీసుకురాగా.. ఆలయ చైర్మన్ జ్వాలాతోరణాన్ని వెలిగించారు. ముందుగా పల్లకీని జ్వాలాతోరణం దాటించారు. అనంతరం భక్తులు వెళ్లారు.